# కాలుతున్న పూలతోట

పెళ్ళి ఊరేగింపు...

పడవలాంటి కారులో వధూవరులు... కారు ముందర సెంట్లవాసనల్తో, పట్టుచీరెలు, నగలతో మెరిసిపోతున్న ఆడవాళ్ళు... కారు వెనక హుందాగా నడుస్తున్న మగవాళ్ళు... చిత్రమైన డ్రెస్సులతో భారీ సౌండ్‌తో ముందు బాజాలూదుతున్న బ్యాండ్‌వాళ్ళ మధ్య తాగి వూగుతున్న యువకులు. దాదాపు పదిమంది వరకూ డాన్సులు చేస్తున్నారు. వాళ్ళతో కలిసి ఒకరిద్దరు అమ్మాయిలు కూడా స్టెప్పులేస్తున్నారు.

అప్పటికే రెండున్నర గంటలైనా ఊరెగింపు అరకిలో మీటరు కూడా సాగలేదు. పిల్లలు భారీ ఎత్తున టపాకాయలు పేలుస్తుండటంతో చెవులు హోరెత్తుతున్నాయి.

ఒక పెద్దమనిషి బ్యాండ్‌వాళ్ళ దగ్గరికొచ్చి వాళ్లలోని బ్యాండ్ మాస్టర్‌ని "సలీం... ఇలాగైతే ఆర్నెల్లయినా ఇంటికి చేరం. తొందరగా నడవండి" అని చెప్పాడు. సలీం బాజా వూదుతూనే మిగతావాళ్లకి కదలమని సైగ చేశాడు. దాంతో డాన్స్ చేస్తున్న యువకులు బ్యాండ్‌వాళ్లని కదిలితే బావుండదని హెచ్చరించారు. వాళ్ల చేష్టలు చూసి చెప్పిన పెద్దమనిషి జారుకున్నాడు.

డాన్స్ చేస్తున్న ఇద్దరు యువకులు బాజా వూదుతున్న సలీంని "హిప్‌హిప్ తారారార...." పాప్‌సాంగ్ పాడమన్నారు.

"సినిమా పాటలు తప్ప వేరే పాటలు రావుసార్" ఊదటం ఆపి వినయంగా చెప్పాడు.

సలీంకి యాభై ఏళ్లుంటాయి. "పోని... దిల్ హై హిందుస్థానిలోది షారుఖ్ పాట పాడు. దానిమీద డాన్స్ చేయాలి."

"అదింకా ప్రాక్టీస్ చేయలేద్సార్. ఆ కేసెట్ నిన్నగాక మొన్ననే రిలీజైంది కద్సార్."

"మరి నీకేం పాటలొచ్చుబే... బాడ్‌ఖావ్..." బాగా తాగినవాడొకడు పైపైకొచ్చాడు.

"వచ్చిన పాటలు పాడుతున్నాం కద్సార్. మాటలు జాగర్తగా రానీయండ్రి" సలీం కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"పాప్‌సాంగ్స్ ఏమి పాడట్లేదు. నీకు రెస్పెక్టిచ్చేదేంట్రా... బొచ్చు..." మరొకడు సలీంని తోసేశాడు. సలీం తలపై పెట్టుకున్న ఎర్రటి కుచ్చుటోపి కిందపడింది. డ్రమ్స్ వాయిస్తున్న కుర్రాడు సలీంని తోసేసిన యువకుడ్ని నిలదీసాడు. దాంతో అంతాకల్సి కుర్రాడ్ని కొట్టడం మొదలెట్టారు. బాజాల సౌండ్ ఆగిపోయింది. ఆ పెనుగులాటలో ఎవరో కుర్రాడు టపాకాయలు పేల్చాడు.

అంతా గోల... గోల...

పెళ్ళికి వచ్చిన పెద్దలు బ్యాండ్ వాళ్ళని యువకుల్ని విడదీసారు. అందర్నీ సముదాయించారు. దాంతో యువకులంతా కసితో బ్యాండ్ వాళ్ళని కదలనివ్వకుండా పేట్రేగిపోయి డాన్సులు చేయడం మొలెట్టారు. వాళ్ళు చెప్పినా వినే స్థితిలో లేరని అందరికీ తెల్సు. ఊరేగింపు ముసలి నత్తలా సాగింది. హోరెత్తిన వాయిద్యానికి నాలుగువేల రూపాయల బ్యాండ్ ఛట్‌మని పగిలింది.

*　*　*　*

"రోజురోజుకీ నీకు చెవులు వినపడేలా లేవు. ఎలాగో ఏమో..." సలీం చెవుల్లో ఇయర్ డ్రాప్స్ వేస్తూ అంది కూతురు షబీనా.

పెళ్ళికెదిగిన బిడ్డవైపు బాధగా చూసాడు సలీం. షబీనా నవ్వింది. మల్లెపువ్వులాంటి ఆ నవ్వు చూసి సలీం బాధనంతా మర్చిపోయాడు. పక్కనే వున్న పీకనందుకొని ఓ పాట ఊదాడు.

"పాట మంచిగుంది... గిదే సిన్మాలోది నాన్నా..."అంది. "సిన్మాలోది కాదు బిడ్డా... ఇన్ని పాటలు వూది వూది నేనే ఓరాగం కట్టిన. ఇది నా షబీనా పెళ్ళికి మాత్రమే నేను ఊదేపాట" అన్నాడు.

పెళ్ళి మాట విని షబీనా సిగ్గుపడి పోయింది.

"ఇన్ని పెళ్ళిళ్ళకు బాజాలూదుతున్నా... నీకు మాత్రం పెళ్ళి చేయలేకపోతున్నా బేటీ... కీబోర్డులొచ్చి మన పొట్టకొట్టినయ్... చాలా పెండ్లిల్లకు రిక్షాలో మైకుపెట్లు, కీబోర్డుపెట్టుకొని వాయిస్తుండ్రు. ఒకప్పుడు సలీంబ్రాస్ బాండ్ అంటే జిల్లాలో గొప్ప పేరుండేది. నలబైమంది వుండేవాళ్ళం. ఇప్పుడు పదహారుమందికి తగ్గింది. అందరూ ఏదేదో పనులు చూసుకుంటూ

వెళ్ళిపోయారు. ఈ వృత్తిని నమ్ముకుంటే పెళ్ళికూడు తప్ప మిగతా రోజుల్లో అన్నం ముద్ద కరువైంది. ముసలితనం వచ్చేసరికి చెవుడుతోపాటు గొంతు నరాలు, ఊపిరి తిత్తులు. పాడవటం తప్ప ఏం మిగిలింది బేటీ. రోజురోజుకూ కొత్తకొత్త పాటలు పుట్టుకొస్తున్నాయ్. ఒక పాట ప్రాక్టీస్ చేసేసరికే మరోపాట పుట్టుకొస్తుంది. నిన్న ఊరేగింపులో పెద్ద గొడవ జేసిండ్రు. 'మేరే హిందుస్తాని' పాట మీద డోలు పగిలింది. ఒకప్పుడు ఎంత శ్రావ్యమైన పాటలు పాడేటోళ్లం... సీతమ్మ పెళ్ళికూతురాయెనే పాట జిల్లాలో నా లెక్క ఎవడూ ఊదలేకపోయేవారు. మా బ్యాండుమేళం వినేటోల్లేగాని... మా ఆకలి వినెటోడే లేకపాయే. అందుకే ఇమాంగాని కొడుకు వీడియో దీస్కుంటగని బ్యాండు మాత్రం వాయించనన్న అన్నాడు..." సలీం నోటినించి ఆవేదనగా వస్తున్న మాటలు షబీనా మనసుని కూడా తొలిచేసాయి.

"సరేగాని.. కొంచెంసేపు పడుకో నాన్నా... ఈమధ్య నీకు ఆయాసం కూడా బాగా వస్తుంది" అంది పక్కపరుస్తూ.

"అదికాదు బేటీ... నీ పెండ్లిజేస్తే నాకు బరువు దిగి పోద్ది. రేపు పొద్దుగాల్ల చిల్వాకోడూర్ దాకా పోత. అక్కడ పిల్లగాడు ఉన్నడట. రజాక్‌గాని తీసుకపోయి చూసత్త..." అన్నాడు.

"రేపు పెండ్లిల్లు లేవా మరి?" అడిగింది షబీనా.

"రేపట్నించి తెలుగోల్లకు మూఢం బిడ్డా... మూడు నెల్లదాక ఏమిలేవు. గిప్పుడు మనకు మంచిరోజులాయె" అంటూ పడుకున్నాడు.

షబీనా బావి దగ్గరకెళ్ళి గిన్నెలు తోముతూ పెళ్ళికొడుకు గురించి ఊహల్లో మునిగిపోయింది.

*　　*　　*　　*

మర్నాడు సలీం అబ్బాయిని చూడటానికి వెళ్ళగానే... షబీనా ఇంట్లో ఒంటరి సీతాకోకచిలుకలా ఎగిరింది. ఆకలి వేయలేదు. అన్నం తిన్నట్లు చేసింది. గోడకున్న గడియారం వంక, తండ్రి అలికిడి కోసం దర్వాజా వంక చూస్తూ గడిపింది. 'ఒకవేళ అబ్బాయి రేపే పెళ్ళి చూపులకు వస్తానంటే...' అన్న ఊహరాగానే ఏ సల్వార్ కమీజ్ వేసుకోవాలి అనుకుంటూ పాత సూట్‌కేసులోంచి బట్టలన్నీ తీసింది.

అన్నీ పాతవే.

కనీసం మంచి చీరెలు కూడా లేవు. అన్నీ వెదుకుతుంటే.. సూట్‌కేసు అడుగున పసుపుపచ్చటి పంజాబీ డ్రెస్సు పట్టుది కనపడింది.

అదంటే షబీనాకి ప్రేమ!

దానిమీది అద్దాల డిజైన్‌లంటే మరీ ప్రేమ!! అది బయటికి తీసింది.

ఆ డ్రెస్సు ఏడాది కిందట ఓ పెళ్ళి కూతురు పెళ్ళయ్యాక చీరెలు తప్ప వీటితో

పనేంటని తన డ్రెస్సులన్నీ బ్యాండ్ వాళ్ళకి పంచిందట. అది ముడతలుగా కనపడటంతో గబగబా బావిదగ్గరికెళ్ళి ఉతికింది. అది ఆరేంతసేపు ఇంట్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వుంది. ఈలోపు ఇస్త్రీపెట్టే రెడీచేసింది. జాగ్రత్తగా ఇస్త్రీ చేశాక తృప్తిగా చూసుకుంది. డ్రెస్సుకి సెంటుపూసి మడిచిపెట్టింది. పాపిటనిండా చల్లుకునే మెరుగుకోసం కిరాణా కొట్టుకి పరిగెత్తింది.

కొట్టునించి వస్తూనే ఇంట్లో తండ్రిని చూసి సిగ్గుల మొగ్గయింది. ఏమీ అడగలేదు. తండ్రికి భోజనం వడ్డించి మొహంలోని భావాల్ని చదవడానికిప్రయత్నిస్తూ ఎదురుగా కూచుంది.

రెండు ముద్దలు తిన్నాక సలీం చెప్పాడు.

"పిల్లగాడు మంచిగానే ఉన్నాడు. మస్కట్‌పోయి సంపాదిత్తండట. కాకపోతే కట్నం బాగా అడుగుతుండ్రు. ఎనభైవేలు కావాల్నట. పదిహేనువేలు, సైకిలు, గడియారం ఇస్తనని నేను చెప్పిన. ఎనభైవేలు సుజుకి బండి గావల్నట. కుండబద్దలు కొట్టినట్టు సెప్పిండ్రు. మనం అందుకునే సంభంధంకాదని ఎనుకకు మర్లినం. రజాక్‌భాయ్ ఎల్లుండి చెర్లపల్లెకు పోదామన్నడు. అక్కడో పిల్లగాడున్నడట..." సరిగా తినకుండానే చేయి, కడుక్కొని లేచిండు సలీం.

షబీనా మనసు మూగబోయింది.

పసుపుపచ్చ పంజాబీ డ్రెస్సు కళ్ళనిండా కనపడుతోంది.

తూనీగ రెక్కలు విరిచినట్లు... సాగిపోయే పాట తెగిపోయినట్టు... స్తబ్దుగా అయింది. సలీం అలసటతతో పక్కమీద ఒరిగాడు. షబీనా తేరుకుంటూ బావి దగ్గరికెళ్లింది అంట్లు తోమడానికి.

మనసుని గోనెసంచిలో కట్టి పడేసినట్టు స్తబ్దత.

ఎన్నో పెళ్లిళ్లకు వెళ్లొచ్చిన ప్రతిసారీ... తనకీ అదే రీతిలో పెళ్లి చేస్తానని చెప్పి నవ్వించే తండ్రి తన పెళ్లికోసం ఎన్ని గడపలు తొక్కాలోనన్న ఆలోచనతో మెదడు మొద్దుబారుతోంది.

గిన్నెలన్నీ తోమేసి ఇంట్లోకి వచ్చి పంజాబీ డ్రెస్సుని మళ్లీ సూట్‌కేసులో పెట్టబోతూ తండ్రిని చూసి అవాక్కయింది.

"అదేంటయ్యా... బ్యాండ్ డ్రెస్ వేసుకున్నవ్. ఇప్పుడు మూఢం అన్నవ్‌కదా. మరి పెళ్లెవరిది?"

సలీం పేలవంగా నవ్వాడు.

"మూఢం పెళ్లిళ్ళకు గాని... చావులకు వుండదమ్మా" అన్నాడు బాజాని గుడ్డతో తుడుస్తూ.

"చావా... ఎవరు...పో...యా...ర...ట..." అంది కొంచెం ఆందోళనగా.

"గొప్పోళ్ల ఇళ్లల్లో శవయాత్ర కూడా పెళ్లిలాగే సాగుతుందమ్మా. ఇప్పుడే రజాక్ భాయ్ వచ్చి చెప్పి వెళ్లాడు. తొందరగా వెళ్లాలట. కాకాపోతే మాబాధంతా ఒకటే... ఆపిల్ల పెళ్లికి

కూడా మేమే బాజాలు వాయించాం. ఏడాది తిరక్కముందే ఆ పిల్లని కట్నం కోసం చంపేసారట. దొంగ గాడిద కొడుకులు..."

"అయ్యో పాపం... ఎవరు నాన్నా ఆమె" అంది షబీనా బాధగా.

"అదే... పోయిన ఎండాకాలం పట్టుదీ పంజాబీ డ్రెస్సు తెచ్చానే... ఆ అమ్మాయిచ్చిందే. పాపం ఆ పిల్లే చచ్చిపోయిందట. కాదు కాదు చంపేసింద్రట"

ఆ మాటతో షాక్‌తిన్న షబీనా చేతిలోని పంజాబీ డ్రెస్సు గబుక్కున జారిపోయింది.

"పిల్ల ఎంత ముద్దుగుండె బేటీ... కండ్లల్ల కనపడుతుంది. పొట్టతో వుందని కూడా చూల్లేదట రాక్షసులు. నాకైతే ఇంకా పెళ్లికూతురు లెక్కనే కనపడుతుంది" అంటూ సలీం నెత్తిపై కుచ్చుల టోపీ పెట్టుకున్నాడు.

బాజా తీసుకొని గబగబా వెళ్లిపోతూ "షబీనా బేటీ... తలుపేసుకో నేను వచ్చేసరికి రాత్రి అయితది" అనుకుంటూ వెళ్లిపోయాడు.

'రఘుపతి రాఘవ రాజారాం...'

షబీనా చెవుల్లో చావుమేళం హోరు... కన్నీటి తెరల మధ్య తండ్రి వెళ్లినవైపే చూస్తుండిపోయింది.

పంజాబీ డ్రెస్సు మీద పెంచుకున్న మమకారం... భయంతో విరిగిపోయింది. గుండె చిరిగిపోయింది.

'పెళ్లి...'

ఆ పదం గుర్తొచ్చి మనసు గడగడా వణికిపోయింది.